నేడు మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం 9, 10వ తరగతుల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రధాని నరేంద్రమోదీ 'చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం.. ప్రధానమంత్రి సంతకం కంటే ఎంతో విలువైనది' అని చెప్పిన అంశంపై పోటీ ఉంటుందని చెప్పారు. మాస్టర్‌మైండ్స్ బాలాజీ క్యాంపస్‌లో ఉదయం 9.00 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు దశలలో నిర్వహించే పోటీల్లో భాగంగా గుంటూరు నగర పరిధిలోని విద్యార్థులకు మొదటి ఫేజ్‌లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వారికి రూ.1,500, రూ.1000, రూ.500 చొప్పున నగదు బహుమతు లు ఇస్తామని వివరించారు. ఈ విధంగా మొదటి మూడు బహుమతులు వచ్చిన ముగ్గురు విద్యార్థులకు రెండు తెలుగు రాష్ట్రాలస్థాయిలో జూమ్ యాప్ ద్వారా గ్రాండ్ ఫైనల్ పోటీలను నిర్వహించి, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.ఐదువేలు, రూ.నాలుగువేలు, రూ.మూడువేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపా రు. వివరాలకు 8978180828, 7416380338లో సంప్రదించాలని కోరారు.

ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులు పరిష్కరించాలి

కమిషనర్ కీర్తి చేకూరి



నెహ్రూనగర్: ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను సంబంధిత విభాగాధిపతులే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో కార్పొరేటర్లతో వా ర్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు.







అర్హులైన ప్రజల ముంగిటకే సంక్షేమ లబ్ధి

పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: అర్హులైన ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. 22, 29, 36 డివిజన్ల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు, ఇళ్ల



లబ్ధిదారుడికి ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ 98 శాతం హామీలను అమలు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సేవలను వలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే ద్వారా అందించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు గేదెల రమేష్, షేక్ రోషన్ గారు, ఉడుముల లక్ష్మీశ్రీనివాసరెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, వైఎస్సార్ నాయకులు దుగ్గెంపూడి వెంకటరామిరెడ్డి, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి సూరసాని వెంకట్‌రెడ్డి, ఎన్నా రెడ్డి పాల్గొన్నారు.

లా ఆఫీసర్స్ నియామకంలో వైఎస్ జగన్ సామాజిక న్యాయం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి



గుంటూరు లీగల్: లా ఆఫీసర్స్ నియామకంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి తెలిపారు. తెనాలి పోక్స్ కోర్టుకు సురేష్ చంద్రయాదవ్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక జీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పోలూరి మాట్లాడుతూ ప్రతిభ, సామాజిక సమీకరణలు ద్వారా లా ఆఫీసర్స్‌ను నియమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సురేష్ చంద్ర యాదవ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల కోఆర్డినేటర్ కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, జీపీ పోకల వెంకటేశ్వరరావు, ఏపీపీలు రమణారెడ్డి, సూరిబాబు, సాగర్, డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వొకేట్స్ పచ్చల అనిల్ కుమార్, మొండితోక శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది షేక్ హబిబుల్లా పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 6/13లో ఎల్‌పీజీ సంస్థ నిర్వహిస్తున్న లక్ష్మీపతి తన సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మొహమ్మద్ షంషా వద్ద రూ.3 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇవ్వకపోగా, డబ్బులు అడిగితే బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం లక్ష్మీపతిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

జల్దీ ఇస్మాయిల్ బాబు జయంతి సభ

నెహ్రూ నగర్: అరండల్ పేటలోని సంఘ కార్యాలయంలో డీబీఎఫ్ నేత జల్దీ ఇస్మాయిల్ బాబు జయంతి సభ శుక్రవారం నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో న్యాయవాది పొందుగల ప్రకాష్, దళిత బహుజన ఉద్యమ నేతలు ఉగ్గం సాంబశివరావు, భూపతి సునీల్ కుమార్, కోడిరెక్క కోటిరత్నం, సంకూరి రాజారావు, మందా వెంకటరావు, జొన్నలగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నీట్-2024పై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్–2024లో సీటు సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధమవుతున్న విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తూ ఉచిత అవగాహన కల్పిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా గైడెన్స్, ఇతర సమాచారానికి 8522958575, 7032264910 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చిత్రలేఖనంలో బాలకుటీర్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్‌టాక్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుధామాధవి తెలిపారు. శ్యామలా నగర్ లోని పాఠశాలలో నిర్వహించిన కా ర్యక్రమంలో తొమ్మిదో తరగతి విద్యా ర్థిని ఏ హర్షిత మెరిట్ బహుమతి రూపంలో రూ. వెయ్యి నగదు, ప్రశంసాపత్రం సాధించినట్లు పేర్కొన్నారు. ఇన్‌టాక్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు లలిత కళలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను బాలకుటీర్ కార్యదర్శి డాక్టర్ ఎన్.మంగాదేవి అభినందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, జయశ్రీ, సీఏఓ రఘురాం పాల్గొన్నారు.

పాటిబండ్ల స్కూల్ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న యలమంచిలి శివాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: వన మహోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన పాఠశాల క మిటీ గౌరవాధ్యక్షుడు డా క్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ పచ్చని మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు. విద్యార్థులు పాఠశాల నుంచి లాడ్జి సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

కర్రసాములో సత్తా చాటిన 'లిటిల్ ఫ్లవర్'

గుంటూరు వెస్ట్(క్రీడలు): సిలంబం అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 2న గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో నిర్వహించిన జిల్లా స్థాయి కర్రసాము పోటీల్లో లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కోచ్ కాశీనాథ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 9 బంగారు పతకాలు గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శవరి, పీడీ వెంకటేశ్వర్లు, కోచ్ సాయి సుబ్రహ్మణ్యం అభినందించారు.

మొక్కలు నాటడంలో యువత కీలకపాత్ర పోషించాలి

గుంటూరు ఎడ్యుకేషన్ మొక్కలు నాటడంలో యువత కీలకపాత్ర పోషించాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టాభిపురంలోని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ కె.వీరబ్రహ్మం, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళీధర్, అధ్యాపకులు జి. సురేష్‌బాబు, ఆర్.జయ శైలజ పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో కారుణ్య నియామకాలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కారుణ్య నియామకాలకు అనుమతి కలిగిన వారికి నియామక పత్రాలను అందజేసినట్లు విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం ఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కారుణ్య ప్రాతిపదికన రెండు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, రెండు క్లాస్ 4 పోస్టుల నియామక పత్రాలను అందజేసినట్లు చెప్పారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చే పనిలో అధికారులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయాన్ని శుభ్రం చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు విజయవాడకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు టెండర్ ఇచ్చిన విష యం తెలిసిందే. కార్యాలయా న్ని శుభ్రం చేసేందుకు జూలై 1 నుంచి విధులకు హాజరవుతున్న సిబ్బంది గురువారం విధులకు హాజరు కాకపోవడంపై 'సాక్షి'లో 'అయినవారు ఉండగా... బయట వారు దండగ ! అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం కూడా విధులకు హాజరైన సిబ్బంది ఇంజినీరింగ్ విభాగం వరకు శుభ్రం చేసుకుని కింద శుభ్రం చేయకుండా వెళ్లిపోయారని...తరువాత మేమే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్

జాతీయ జెండాను గౌరవించడం బాధ్యత

నెహ్రూనగర్: జాతీయ జెండాని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. జిన్నా టవర్ వద్ద నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ జెండా వర్షంలో తడిచి, రద్దీ కూడలిలోని వాయు కాలుష్యం వలన దుమ్ము పట్టడంపై పలు పత్రికలు, మాజీ సైనికుల, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఫిర్యాదు మేరకు స్పందించి శుక్రవారం నూతన జెండాను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు జిన్నా టవర్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా దుమ్ము అంటి ఉన్నదని దీనిపై పలువురు ఫిర్యాదు చేశారని, వెంటనే పాత జెండా స్థానంలో నూతన జెండాను శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మద్యం మత్తులో ప్రమాదం

పట్నంబజారు మద్యం తాగి వాహనం నడుపుతూ వ్యక్తిని గాయపరిచిన ఘటనపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ నిసార్ బాషా తెలిపిన వివరాలు శుక్రవారం తెల్లవారుజామున పూటుగా మద్యం తాగిన చుక్కా దినేష్, హిమని సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్తూ గాంధీ పార్కు వద్ద డివైడర్‌పై నిద్రిస్తున్న ముంగమూరి ప్రదీప్‌ని ఢీకొట్టాడు. మద్యం మత్తులో అజాగ్రత్తగా కారు డ్రైవ్ చేయడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రదీప్ కాలుకు గాయం కావడంతో, విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం చేర్పించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని ప్రమాదానికి కారణమైన దినేష్‌తో పాటు, అతడికి డ్రైవింగ్ రాదని తెలిసి కూడా కారు ఇచ్చిన పోతనబోయిన శ్రీకాంత్, కారు యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గుంటూరులో ఎవరెస్ట్ ల్యాబ్ ప్రారంభం

పాత గుంటూరు: సిద్ధార్థ నగర్ రెండోలైనులో ప్రముఖ క్లైమెట్ టెక్ కంపెనీ, రీసైకిల్ ఓఎస్ డెవలపర్ అయిన ఎవరెస్ట్ ల్యాబ్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ల్యాబ్ వ్యవస్థాపకుడు అంబటి జగదీష్ మాట్లాడుతూ రీసైక్లింగ్ పరిశ్రమ కోసం, రోబోటిక్స్ పరిష్కారాలపై సంస్థ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెన్నీఫర్, సిద్ధార్థ పాల్గొన్నారు.



నేడు డీ-పీఆర్టీయూ విద్యాసదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ రీ ఆర్గనైజ్డ్ టీచర్స్ యూనియన్ (డీ–పీఆర్టీయూ) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం విద్యాసదస్సు నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జువ్వా జ్ఞానేశ్వరరావు, సలివేంద్రపు బాల సుందరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలా ఆస్పత్రి వద్ద ఉన్న మదర్ థెరీస్సా ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలి

గుంటూరు ఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. శుక్రవారం సాంబశివపేటలోని ఇంటర్‌బోర్డు ఆర్జేడీ కార్యాలయం ఎదుట వివిధ సమస్యలపై నిరసన వ్యక్తం చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆర్జేడీ వీవీ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, తేజ, కిరణ్ నాయక్, అజయ్, బన్నీ, నాగేశ్వరరావు ఉన్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని గ్రంథా లయ సంస్థ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఎన్నికల కమిటీ అధికారులు కోన దేవదాసు, ఎస్ఎం సుభానీ, వీవీ రమణ, మల్లికార్జున్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో పీవీ సుబ్బారెడ్డిని రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు బత్తుల దేవానంద్, ఆర్.పిచ్చయ్య, ఏపీ జీఎఫ్ కో–చైర్మన్ ఏ భాస్కర్‌రెడ్డి, కో–కన్వీనర్ మురికిపూడి దేవపాల్, రాష్ట్ర సంఘ గౌరవాధ్యక్షుడు తోట నరసింహారావు, కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి చేతుల మీదుగా రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

